క్లుప్తంగా

ద్రవ జీవామృతం తయారీపై అవగాహన



ద్రవజీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని మిర్తివలస బయో ఇన్పుట్ సెంటర్ వద్ద ఎంసీఆర్పీ లక్ష్మి, తిరుపతిరావు ఆధ్వర్యంలో శనివారం ద్రవ జీవామృతం తయారు చేసి, వాటి వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. 110 లీటర్ల దేశీయ ఆవు మూత్రం, 110 కిలోల ఆవు పేడ, 21 కిలోల బెల్లం, 21 కిలోల శనగపండితో ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ జీవామృతం వినియోగంతో భూసారం పెరుగుతందని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తిరుపతిరావు పాల్గొన్నారు.

సంతాపం..



పిట్టల సీతమ్మ (ఫైల్)

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామానికి చెందిన వార్డు మెంబర్, వైఎస్సార్సీపీ మద్దతుదారు పిట్టల సీతమ్మ గురువారం సాయంత్రం స్వగృహంలో మృతి చెందడంతో, పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు పలు గ్రామాల సర్పంచ్లు, వైఎస్సార్సీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

కొయ్యానపేటలో పారిశుధ్య పనులు



కాలువల్లో మురుగు తొలగిస్తున్న కార్మికులు

మక్కువ: మండలంలోని కొయ్యానపేటలో పంచాయతీ కార్యదర్శి జగన్ మోహనరావు ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగున పారిశుధ్య కార్మికులు తొలగించారు. అంటురోగాలు ప్రబలకుండా కాలువలను శుభ్రం చేస్తున్నట్లు కార్యదర్శి జగన్ మోహనరావు తెలిపారు.

కోతకు గురైన రోడ్లు



పాడైన నందేడువలస - కేరంగి రోడ్డు

పాచిపెంట: ఇటీవల కురిసన వర్షాలకు గిరిజన గ్రామాల్లోని పలు రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. నందేడువలస, కేరంగి మధ్య నిర్మాణంలో ఉన్న రోడ్లు కూడా పాడయ్యాయి.

పశువుల లారీ పట్టివేత



కంటెయినర్లో ఉన్న పశువులు

పాచిపెంట: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, మండలంలో పి.కోనవలస చెక్పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా.. ఒడిశా రాష్ట్రం కుందిలి నుంచి మానాపురం సంతకు పశువులను తీసుకువస్తుండగా.. లారీ పట్టుబడిందన్నారు. 33 ఆవులను కొత్తవలస గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్



పట్టుకున్న పొట్టేళ్లు, పందెంరాయుళ్లతో పోలీసులు

వీరఘట్టం: మండలంలోని వండువ శివారు తోటల్లో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై ఎస్ఐ జి.కళాధర్ సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ దాడిలో రెండు పొట్టేళ్లతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: స్థానిక పోలీస్స్టేషన్లో ఎస్ఐలుగా రమేష్, జ్ఞానప్రసాద్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీరిలో రమేష్ స్థానిక పోలీస్స్టేషన్ ఎస్ఐ కాగా జ్ఞానప్రసాద్ ట్రాఫిక్ ఎస్ఐ కావడం గమనార్హం. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా మని వారు తెలిపారు.

రాజీయే రాజమార్గం



లోక్ అదాలత్లో పాల్గొన్న ఏజేఎఫ్సీఎం సామ్య జోస్ఫిన్

- అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ సామ్య జోస్ఫిన్

పార్వతీపురం:

రాజీ మార్గమే ఇరువర్గాల వారికి ఎంతో శ్రేయస్కరమని పార్వతీపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ సామ్య జోస్ఫిన్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, వివాదాలను ఇరువర్గాలు సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఇది గొప్ప అవకాశమన్నారు. కేసులు కోర్టులో పెండింగ్లో ఉన్నంతవరకు కక్షిదారులు వ్యయప్రయాసలకోర్చి కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నారు.



సాలూరు: పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్అదాలత్

ఒకసారి లోక్అదాలత్లో రాజీ కుదుర్చుకున్నాక ఆ విషయమై ఇకపై కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. మొత్తం 647 కేసులను రాజీ చేశారు. ఇందులో ప్రోనోట్ కేసులు ఆరు, చెక్బౌన్స్ కేసులు మూడు, అమలు పిటిషన్ ఒకటి, బీఎస్ఎన్ఎల్ ప్రి లిటిగేషన్ కేసులు 17, మెయింటినెన్స్ కేసు ఒకటి, క్రిమినల్ కేసులు 145, సమ్మరీ ట్రయల్ కేసులు 474 ఉన్నాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, ఏపీపీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం

సాలూరు: పట్టణంలోని కోర్టు వద్ద నిర్వహించిన జాతీయ మెగా లోక్అదాలత్ విజయవంతమైంది. ఇన్చార్జ్ జడ్జి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సివిల్, క్రిమినల్, మనోవర్తి, తదితర సుమారు 570 కేసులు రాజీ చేసినట్లు కోర్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఆది దేవుడైన వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పట్టణంలోని రామాకాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారిని శనివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వినాయకుడ్ని దర్శించుకుంటున్న రాజన్నదొర

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం..

వీరఘట్టం: మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎంఈఓ డి.గౌరినాయుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పిల్లల ఫీజు రీఇంబర్స్మెంట్ కోసం వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. మిగులు ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులు ఉండి సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



దేవునికి సత్ప్రసాదం సమర్పిస్తున్న ఫాదర్లు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పరిశుద్ధ శిలువ దేవాలయం(చర్చి) 26వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సవర కోటపాడు విచారణ గురువు, ఫాదర్ చార్లెస్ తొలిపూజ చేపట్టి, ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. సర్వమానవాళి శ్రేయస్సుకు, ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ శాంతి, సమాధానాలతో జీవించాలన్నారు. మండల కేంద్రంతో పాటు ఎల్విన్పేట, సవర కోటపాడు, లక్కగూడ, కొండవారిగూడ, పి.లేవిడి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు తోమస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధిలోని కేఆర్ పురానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్కానిస్టేబుల్ వి.జనార్దనరావు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సదరు యువతి కనిపించకపోగా, తెలిసిన వారి ఇళ్లల్లో భోగట్టా చేసినా ఫలితం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని స్థానిక ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలెక్టర్ ఎ.శ్యామ్ప్రసాద్ శనివారం పరిశీలించారు. సర్వే నంబర్ 249/1లోని 1.34 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు ఆర్డీఓ కె.హేమలత తెలిపారు. గుర్తించిన స్థలం అనువుగా ఉండడంతో విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ కోర్సులకు సంబంధించి ప్రయోగశాలను ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చుట్టూ పార్క్ అభివృద్ధి చేస్తామన్నారు. పరిశీలనలో ఉప తహసీల్దార్ టీవీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డీఈ డి.గౌరునాయుడు, కళాశాల అధ్యాపకులు గుప్త, ఆర్ఐ వి.రామకృష్ణ, సర్వేయర్ కై లాసం, వీఆర్ఓ గంగరాజు, తదితరులున్నారు.

న్యూట్రీ గార్డెన్ పరిరక్షణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్స్ ఏర్పాటుకు చేపట్టిన 'మనబడి–మనతోట' కార్యక్రమం సరైన పర్యవేక్షణ లేక మసకబారుతోంది. వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 4న చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ప్రసాద్ పాల్గొని విత్తనాలు చల్లి, మొక్కలు నాటారు. అయితే కలెక్టర్ వెళ్లిన తరువాత న్యూట్రీ గార్డెన్పై పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. దీనిపై శనివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వివరణ కోరారు. దీంతో ఆర్జేడీ, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు మండల విద్యాశాఖ అధికారి డి.గౌరినాయుడుకి ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఆయన వెంటనే బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి హెచ్ఎం బి.సాంబురుతో కలిసి న్యూట్రి గార్డెన్ను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు న్యూట్రీ గార్డెన్లో వేసిన విత్తనాలు కొట్టుకుపోయాయని, అక్కడక్కడా చిన్న మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన మొక్కలను పరిరక్షించాలని ఎంఈఓ సూచించారు. వారితో పాటు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు ఉన్నారు.



బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్ను పరిశీలిస్తున్న ఎంఈఓ గౌరినాయుడు

పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నం



పంచాయతీ కాలువపై వేసిన సిమెంట్ పలకలు, గోడ కట్టేందుకు సిద్ధం చేసిన సిమెంటు ఇటుకలు



గోడ కట్టేందుకు చూస్తున్న పంచాయతీ స్థలం ఇదే

- చోద్యం చూస్తున్న అధికారులు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలోని అందవరపువీధి శివారున తూర్పు వైపు నుంచి ప్రధాన రహదారికి వెళ్లేందకు పూర్వం నుంచి 3 అడుగుల సందు ఉండేది. అయితే వీధికి శివారున ఆరు నెలల కిందట నూతనంగా ఓ భవన నిర్మాణం చేపట్టారు. వీధి శివారున 3 అడుగుల దారి గుండా మురుగు కాలువ ఉండడంతో దానిపై సిమెంట్ పలకలు వేశారు. అంతేకాకుండా భవన యజమాని డాబా పైకి వెళ్లేందుకు వీలుగా కాలువ మీదుగా ఇనుప నిచ్చెన ఏర్పాటుచేశారు. ఇన్నాళ్లు ఎవరూ ప్రశ్నించకపోవడంతో వీధి శివారున ఉన్న సంధును కూడా ఆక్రమించేందుకు రెండు రోజుల క్రితం గోడ కట్టేందుకు పూనుకున్నాడు. ఆ ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. పంచాయతీ దారిని ఆక్రమించి గోడ కడితే ఊరుకునేది లేదని హెచ్చరించడంతో ఆ నిర్మాణం నిలిచిపోయింది. ఆక్రమణలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి పంచాయతీ దారిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈఓ రవి వద్ద ప్రస్తావించగా తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా లక్ష పత్రి పూజ



పార్వతీపురం: సంగంవలసలోని కూరాకుల వీధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



వెంగాపురంలో లక్షపత్రి పూజలు అందుకున్న స్వామివారు

బలిజిపేట:

మండలంలోని వెంగాపురం అగ్రహారంలో ఏర్పాటు చేసిన వినియక మండపంలో శనివారం స్వామివారికి లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. అర్చకులు కె.గోపాలకృష్ణ, కె.ఫణికుమార్ శర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే స్వామివారికి లక్ష నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు..

పార్వతీపురం: మండలంలోని సంగంవలస కూరాకుల వీధిలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకుడు పి. శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో మహిళలకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంకా ముంపులోనే పొలాలు..



లక్ష్మీపురంలో కుళ్లిపోయిన వరి దుబ్బులు

సీతానగరం:

ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. వరి దుబ్బులు కుళ్లిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వెంకటాపురం, లక్ష్మీపురం, అంటిపేట గ్రామాల్లో వరి పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. అలాగే మక్కువ – అజ్జాడ బీటీ రోడ్డులోని బుడ్డిపేట మలుపు వద్ద రోడ్డుపై గోతులేర్పడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మక్కువ – చినభోగిలి గ్రామాల మధ్య 16 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



బుడ్డిపేట మలుపు వద్ద గోతిలో వర్షపు నీరు

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?



గుమడ వద్ద బురదమయమైన రోడ్డులో వాహనదారుల అవస్థలు



గుమడ ప్రధాన రహదారిలో గోతిలో దిగబడిన లారీ



కూనేరు ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

కొమరాడ: పార్వతీపురం నుంచి కొమరాడ మండలం మీదుగా ఒడిశా వైపు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు, మట్టి, బురదతో ఉండడంతో ఆ దారిలో వెళ్లే వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు, మట్టితో గోతులు నిండి ఉండడంతో వాటిల్లో భారీ వాహనాలు దిగబడిపోయి ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. దీంతో ఆ దారిలో తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రాజాం సిటీ: మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని రాజాం రెడ్క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల మృతి చెందిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంఘ వ్యవస్థాపకుడు గురజాపు కృష్ణమాచారి గుర్తుగా పట్టణంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్వీజే నాయుడు, పెంకి గౌరీశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీదుర్గా భారత్ గ్యాస్, సంతకవిటి ఏజెన్సీ వారు వంటగ్యాస్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరగకుండా, వంట చేసేటప్పుడు గ్యాస్ వినియోగం తక్కువ అయ్యేందుకు పాటించాల్సిన మెలకువలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.షణ్ముఖరావు, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు ఎ.గణపతి నాయుడు, పి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు..

బొబ్బిలి: పట్టణంలో తన ఎలక్ట్రిక్ స్కూటీ పోయిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన కొన్నిగంటల వ్యవధిలోనే పోలీసులు దొంగను పట్టుకుని, స్కూటీని యజమానికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన వాసుదేవరావు స్థానిక పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం తన స్కూటీని నిలిపి ఉంచి, అక్కడి దగ్గరలోని ఓ చోటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, జమ్మడవలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణ అనే వ్యక్తి ఆ స్కూటీని దొంగిలించినట్లు గుర్తించి, పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమేష్కుమార్ తెలిపారు. ఆ స్కూటీని యజమానికి అప్పగించామన్నారు.

సోషల్ ఆడిట్లో రూ.12,047 రికవరీ

బొబ్బిలి రూరల్: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో చేతివాటం చూపిన 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.12,047 రికవరీ చేసినట్లు ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సోషల్ ఆడిట్ వివరాల వెల్లడి కార్యక్రమ ముఖ్యాంశాలను శనివారం తన కార్యాలయంలో విలేకరులతో వెల్లడించారు. వేతనదారుల మస్టర్లు, పనుల కొలతల్లో తేడాలు నేపథ్యంలో ఆడిట్ బృందం ఆ మేర చర్యలు తీసుకుందన్నారు. కింతలవానిపేట, పక్కి గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్లో భాగంగా 70 మొక్కలు నాటాల్సి ఉండగా, కేవలం 30 మొక్కలు మాత్రమే నాటినట్లు గుర్తించామన్నారు.